క్లుప్తంగా

'మదర్‌థెరిస్సా'కళాశాలకు న్యాక్ ఏ+ గుర్తింపు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(మిస్ట్)కి న్యాక్ ఏ+ గ్రేడ్ లభించింది. ఐదేళ్ల కాలానికి గాను ఈ గుర్తింపు ప్రకటించారని ప్రిన్సిపాల్ సీహెచ్.హరికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలకు 2017లో బీ గ్రేడ్ లభించగా, ఇప్పుడు ఏ+ గ్రేడ్ లభించిందని చెప్పారు. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కళాశాలల్లో తమ కళాశాలకే ఈ గుర్తింపు వచ్చిందని తెలిపారు. ఈసందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, డైరెక్టర్ డాక్టర్ కందిమళ్ల కృష్ణారావు, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

కల్లూరు: కల్లూరు పట్టణానికి చెందిన ఆకునూరు మణికంఠ ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. దీంతో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రూ.5 లక్షల పరిహారం చెక్కును అందించింది. దీనిని శనివారం శనివారం స్థానిక ఏఎంసీ కార్యాలయం ఆవరణలో మృతుని తండ్రి నరసింహారావుకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీరవల్లి రఘు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సొసైటీ చైర్మన్లు రామారావు, లక్ష్మణరావు, రఘు, చందర్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్, విద్యుత్‌శాఖ ఏఈ గణేష్ పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ..

సత్తుపల్లి: మహేష్ యూత్ ఆధ్వర్యంలో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య జన్మదినం సందర్భంగా వాల్ పోస్టర్లను ప్రచురించారు. వీటిని శనివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సండ్ర ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కౌన్సిలర్లు ఛాంద్‌పాషా, అనీల్, ప్రసాద్, పవన్, పెద్దిరాజు, వెంకటేశ్వరరావు, శ్రీను, వేణు, శివ, రాజ్‌కుమార్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

గీతా మందిరంలో భక్తులకు అన్నదానం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని గీతాజ్ఞాన మందిరంలో గల శ్రీపార్థసారథిస్వామి ఆలయంలో శనివారం ఏకాదశి పర్వదినం సందర్భంగా భగవద్గీత పారాయణం నిర్వహించారు. అనంతరం కొణిజర్ల రాజా, శైలజ దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపూరి పురుషోత్తం, తాటి వెంకటేశ్వరరావు, రాఘవయ్య, భాస్కర్‌రావు, రాజా, చక్రధర్‌రావు, వాసు, వెంకన్న పాల్గొన్నారు.

వెంకటకృష్ణారెడ్డికి సత్కారం

ఎర్రుపాలెం: మండలంలోని సఖినవీడు గ్రామానికి చెందిన గుర్రాల వెంకట కృష్ణారెడ్డి(23) ఎస్సై ఉద్యోగానికి ఎంపికయ్యాడు. దీంతో శనివారం ఆయనను ఆ గ్రామానికి చెందిన మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, సర్పంచ్ భాస్కరరెడ్డి, వైస్ ఎంపీపీ రామకోటేశ్వరరావులు శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి, తల్లిదండ్రులకు వెంకటకృష్ణారెడ్డి కీర్తిప్రతిష్టలు తెచ్చిపెట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

కొణిజర్ల: తెలంగాణ గ్రామీణ వైద్యుల సేవా సంఘం వైరా డివిజన్ ప్రథమ మహాసభ కొణిజర్లలోని శ్రీరామ కల్యాణ మండపంలో నేడు నిర్వహిస్తున్నామని దానిని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సలీమ్ పిలుపునిచ్చారు. శనివారం కొణిజర్లలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ వైద్యుల సంక్షేమం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర విషయాలపై మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సభకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి వెంకటేశ్వర్లు, కొణిజర్ల సర్పంచ్ రామారావు, ఖమ్మం నగరానికి చెందిన పలువురు ప్రముఖ వైద్యులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సభకు గ్రామీణ వైద్యులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు.

ఆలయాల్లో చోరీలు

సత్తుపల్లిరూరల్: మండలంలోని సిద్ధారంలో రెండు ఆలయాల్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గ్రామంలోని ముత్యాలమ్మగుడి ఆలయ హుండీ పగలగొట్టిన దుండగులు సుమారు రూ.16వేల నగదు చోరీ చేశారు. ఇక రామాలయంలోని హుండీనే ఎత్తుకెళ్లారు. ఇందులో రూ.10వేల మేర వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

గడువు పొడిగించాలి

సత్తుపల్లిరూరల్: క్రిష్టియన్ మైనార్టీలకు ప్రభుత్వం ఇచ్చే రూ.లక్ష రుణాల దరఖాస్తుల గడువు ఈ నెల 30 వరకు పొడిగించాలని బైబిల్‌మిషన్ చర్చి పాస్టర్, ఎస్సీసీ మండల అధ్యక్షుడు బేతంపూడి వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. క్రిష్టియన్ మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకొనేందుకు ఈ నెల 14 వరకు గడువు పెట్టడం వల్ల సర్టిఫికెట్లు సకాలంలో అందక దరఖాస్తులు చేసుకోలేకపోతున్నారని తెలిపారు.

క్రికెట్ రారాణి.. కృష్ణవేణి!

- గ్రామీణ స్థాయి నుంచి.. జాతీయ స్థాయికి
- అండర్19కి ప్రాతినిధ్యం
- గురుకులంలో చదువుతూ.. ఆటలో రాణిస్తున్న వైనం





తన కోచ్ అబీద్‌హుస్సేన్‌తో క్రికెట్ టీం

ముదిగొండ: క్రికెట్ ఆటకు దేశ వ్యాప్తంగా ప్రస్తుతం ఎంతో క్రేజ్ ఉంది. ఈ ఆటలో రాణించేందుకు ఎంతోమంది తహతహలాడుతున్నారు. అయితే, ఇందులో రాణించాలంటే ప్రతిభతోపాటు శిక్షణ తీసుకునేందుకు చాలా వనరులు ఉండాలి. కానీ, ఆటపై మక్కువ ఉంటే చాలు ప్రతిభ చూపవచ్చు అని ఓ బాలిక చాటిచెప్పింది. ఎన్నో ప్రతికూలతలు నిలువరించినా.. ఆర్థిక స్తోమత అడ్డువచ్చినా మొక్కవోని పట్టుదలతో జాతీయస్థాయి టోర్నీల్లో రాణిస్తోంది. ఆటపై ఉన్న ఆసక్తే ఆమెను వెలుగులోకి తెచ్చేలా చేసింది. అండర్-19 విభాగంలో ఆల్ ఇండియా ఉమెన్స్ టీ20 లీగ్‌లో తెలంగాణ తరఫున ప్రాతినిధ్యం వహించి సత్తా చాటింది. పలు జాతీయ స్థాయిల పోటీల్లో పాల్గొని తానేంటో నిరూపించుకుంది.

ఆడి

చదువుతూ.. క్రికెట్‌లో రాణిస్తూ..

ముదిగొండ మండలంలోని కమలాపురం పంచాయతీలో ఉన్న అయ్యగారిపల్లి దళిత కాలనీకి చెందని ఆటో డ్రైవర్ పందిరి అంజయ్య, నాగరత్నమ్మ దంపతుల కుమార్తె కృష్ణవేణి కృష్ణవేణి జాతీయస్థాయిలో రాణిస్తోంది. ఆమె తెలంగాణ గురుకుల సంక్షేమ పాఠశాలలో చదువుతుంది. ఈ క్రమంలో రాష్ట్ర స్థాయి గురుకుల పాఠశాలల క్రికెట్‌పోటీల్లో ఆడి తన సత్తా చాటింది. చిన్ననాటి నుంచే క్రికెట్ అంటే మక్కువతో గ్రౌండ్‌లో ఆడుతున్న తీరును చూసి కోచ్‌లు ఆశ్చర్యపోయారు. ఆమెను కోచింగ్‌కు ఎంపిక చేశారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ తెలిపాడు. కానీ అప్పుడు తనకు తెలియదు అక్కడ అంతర్జాతీయ స్థాయిలో కోచింగ్ ఇస్తారని. అక్కడ మొదలైన ఆట రెండేళ్లలోనే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)కు చేరింది. హెచ్‌సీఏ తరఫున స్టేట్ లెవల్‌లో ఆడేందుకు అర్హతను సాధించింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) 2019-20 ఫిబ్రవరి-మార్చిలో మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో నిర్వహించాల్సిన అండర్-19 జాతీయ మహిళల టోర్నీకి ఎంపికై ంది. కరోనా లాక్‌డౌన్ కారణంగా ఆమె ఆడకపోయినా 15మంది జట్టు సభ్యుల్లోనూ తాను ఉంది.

సండే స్పెషల్

నిరుపేద కుటుంబం నుంచి..

ఆమె తండ్రి ఆటో నడుపుతూ.. తన కూతురిని మంచి చదువు అందించాలనే ఉద్దేశంతో నేలకొండపల్లిలోని గురుకుల పాఠశాలలో చేర్పించాడు. మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ సమీపంలో కమ్మదనం అనే గ్రామంలోని గురుకుల పాఠశాలలో క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేశారు. దీనికి ఇన్‌చార్జ్‌గా హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, స్పోర్ట్స్ ఆఫీసర్‌గా రామ్ లక్ష్మణ్, ప్రిన్సిపాల్‌గా విద్యుల్లత ఉన్నారు. వీరు ఏటా రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో టోర్నీలు నిర్వహించి.. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని కమ్మదనం క్రికెట్ అకాడమీకి తీసుకొస్తారు. అత్యున్నతమైన కోచ్‌లతో శిక్షణను ఇప్పిస్తారు. ఇక్కడ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్‌సీఏ తరఫున ఆడిస్తారు. క్రికెట్‌తో పాటు 20రకాల క్రీడలను కూడా ప్రత్యేక అకాడమీలున్నాయి. దీనిలో భాగంగానే కృష్ణవేణి కూడా మంచి ప్రతిభ కనబరిచి 17ఏళ్లకే బీసీసీఐ నేషనల్ అండర్ టోర్నీకి ఎంపికై ంది. ఇప్పుడు నేలకొండపల్లిలో బైపీసీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకుంది.

రాష్ట్రం గర్వపడేలా ఆడుతా..



కృష్ణవేణి అనుభవం.. క్రికెట్‌లో మెళకువలు తెలియని నాకు నాకు కోచ్‌లు, హెడ్ కోచ్ నరేందర్‌గౌడ్, అబీబ్‌హుస్సేన్, మతిన్‌లు ప్రతి ఒక్కటీ అర్థమయ్యేలా వివరించి ప్రాక్టీస్ చేయించారు. మొదటిసారి విమానం ఎక్కిన అనుభూతిని ఎప్పటికీ మర్చిపోలేను. మరింత శ్రమించి ఇండియా టీమ్ తరఫున ఆడి నా తల్లిదండ్రులు, మా గ్రామం, రాష్ట్రం గర్వపడేలా ఆడుతా.

– కృష్ణవేణి, ముదిగొండ

చాలా ఆనందంగా ఉంది..



నా కుమార్తె క్రికెట్‌లో ఇంతలా రాణిస్తోందని ఎన్నడూ ఊహించలేదు. జాతీయ స్థాయిలో ఆడేంత ప్రతిభ ఉందని మేము కలలో కూడా అనుకోలేదు. తనని ఎక్కడ క్రికెట్ గ్రౌండ్‌లో క్రికెట్ డ్రస్‌లో చూసినా ఎంతో ఆనందపడేవాళ్లం. చదువుతో పాటు మంచి ప్రతిభను అందించిన ఘనత అకాడమీవారిదే. ఇండియా నుంచి ఎంపిక కావాలని, క్రికెట్‌లో రాణించాలనే మా తపన.

– పందిరి అంజయ్య, తండ్రి

'మువ్వా'పై కక్షపూరిత రాజకీయాలు

కాంగ్రెస్ నాయకుడు కొండూరు సుధాకర్



కొండూరు సుధాకర్

సత్తుపల్లి/సత్తుపల్లి టౌన్: డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబుపై బీఆర్ఎస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ అసత్య ఆరోపణలు చేస్తోందని కాంగ్రెస్ నాయకుడు కొండూరు సుధాకర్ ఆరోపించారు. సత్తుపల్లిలో శనివారం ఆయన మాట్లాడుతూ విజయ్‌బాబుపై తప్పుడు కేసులు బనాయించటమే కాకుండా సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయడం గర్హనీయమని పేర్కొన్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంట నడుస్తుండడంతోనే విజయబాబుపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. కాగా, స్థానిక క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబుపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్‌లో చేరగానే అవినీతి పరుడని ముద్ర వేయటం తగదన్నారు. నాయకులు రావి నాగేశ్వరరావు, రామిశెట్టి సుబ్బారావు, గాదిరెడ్డి సుబ్బారెడ్డి, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఐ.కృష్ణ, బాజీ, యాకోబు, ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, రహీం, దేవప్రియుడు, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

చింతకాని: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని పీవైఎల్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శులు రాకేష్, జాన్సీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం చింతకాని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సర్వే చేసి డాక్టర్ వెంకటేశ్వర్లుతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలంలో పారిశుద్ధ్యం లోపించి దోమలతో సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వంటి విష జ్వరాలు వస్తున్నాయని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, దోమల నివారణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని తెలిపారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆవుల మంగతాయి, రవీందర్ పాల్గొన్నారు.



డాక్టర్ వెంకటేశ్వర్లుతో మాట్లాడుతున్న పీవైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు

దాతలు సాయం అందించండి..?

తల్లాడ: తల్లాడ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన షేక్.అన్వర్ టైర్ల షాపు పెట్టుకున్నాడు. ఇటీవల లారీ టైరుకు గాలి పెడతుండగా టైరు పేలి రెండు కళ్లు దెబ్బతిన్నాయి. ఎడమ కన్ను పూర్తిగా దెబ్బతిందని, కుడి కంటికి ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు అన్వర్ తండ్రి షేక్ దస్తగిరి తెలిపారు. వారు నిరుపేద కుటుంబం కావడంతో.. తన కుమారుడి కంటి ఆపరేషన్‌కు ఎవరైనా దాతలు ఆర్థిక సాయం అందించాలని కోరాడు. సాయం చేయదలచిన దాతలు 9666533677, 9963293742 నంబర్లకు ఫోన్‌పే చేసి ఆదుకోవాలని కోరారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అన్వర్

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

మధిర: ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎదుట ఉన్న ఏఐఎస్ఎఫ్ గద్దె వద్ద సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని బ్రిటిష్ సామ్రాజ్యవాదుల చెర నుంచి మాతృభూమి విముక్తి కోసం 1936, ఆగస్టు 12న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని తెలిపారు. పోరాటాలు, త్యాగాలే ధ్యేయంగా ఏర్పాటైన విద్యార్థి సంఘం స్వాతంత్రం అనంతరం ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. 87 సంవత్సరాలుగా విద్యార్థుల శ్రేయస్సు కోసం ఉద్యమాలు నిర్వహిస్తూ, గల్లీ నుంచి ఢిల్లీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలే ఊపిరిగా, పోరాటాలే ప్రాణంగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ పనిచేస్తుందన్నారు.

నిజంగా అభివృద్ధి చేసి ఉంటే ఈ అనుమతి వేటు ఎందుకని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యంగల ఉజ్వల్ చరణ్, సాయి, ప్రకాష్, మహేష్, సాయి పవన్, క్రాంతి, మణికంఠ, నరేంద్ర, ప్రేమ్ కుమార్, గణేష్, విజయ్, శివ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న మడుపల్లి లక్ష్మణ్

ముసలిమడుగులో విజయబాయి పర్యటన

వైరారూరల్: మండలంలోని ముసలిమడుగు గ్రామంలో శనివారం కాంగ్రెస్ నాయకులు విజయబాయి పర్యటించారు. ఎస్సీ, బీసీ కాలనీలలో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు మూడెకరాలు, డబుల్ బెడ్‌రూం, నిరుద్యోగభృతి తదితర పథకాల పేరుతో పేద, మధ్య తరగతుల కుటుంబాలను మభ్యపెట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే సొంత గూడు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల నగదు మంజూరు చేయనున్నట్లు వివరించారు. సంక్షేమ పాలన కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం కానున్న నేపథ్యంలో.. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గద్దె దింపి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

ఈసీఈ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

కొణిజర్ల: ఇంజనీరింగ్‌లో ఈసీఈ విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్ అవకాశాలు ఉన్నాయని విజయ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి ఇంటెల్ కంపెనీ డీఎఫ్‌టీ ఇంజనీర్ బి.పుల్లారావు అన్నారు. శనివారం విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విద్యార్థులకు కేరీర్ ప్రాస్పెక్ట్స్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు హాజరైన పుల్లారావు మాట్లాడుతూ.. విద్యార్థులకు కేరీర్ పట్ల నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని నిరంతరం కృషి చేస్తే విజయం సాధ్యమన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం పుల్లారావును ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.జాన్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరావు, ఎకడమిక్ డీన్ డాక్టర్ చిన్నయ్య వివిధ విభాగాల హెచ్‌ఓడీలు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడిగా పుల్లయ్య



కోట పుల్లయ్య

సత్తుపల్లిరూరల్: మండలంలోని తాళ్లమడలోని బాలుర గురుకుల పాఠశాలలో పేరెంట్స్ నూతన కమిటీని శనివారం పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా కోట పుల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా చింతలపూడి కృష్ణ, ఉపాధ్యక్షులుగా టి.సంతోష్‌కుమారి, మేకల ప్రసాదరావు, కోశాధికారిగా ఆర్.రాములు, జాయింట్ సెక్రటరీగా బి.బాలకృష్ణ, టి.కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా బి.ప్రతాప్, కె.రవి, బి.సంతోష్, టి.జయకుమార్, టి.నాగేశ్వరరావు, జి.వీరన్న, జి.సాంబయ్య, ఐ.నాగలక్ష్మి, ఎం.లక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు రాజేష్, శేషు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నందీశ్వరుడికి పంచామృతాభిషేకం

తల్లాడ: అదిక శ్రావణమాసం ఆదివారం బహుళ త్రయోదశి సందర్భంగా తల్లాడలో గత దశాబ్దాలుగా వేంచేసి ఉన్న నందీశ్వరుడు(బసవన్న)కు పంచామృతాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కంచెల సతీష్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ప్రదోష కాలనం 5 గంటల నుంచి పంచామృతా భిషేకం ప్రారంభమౌతుందనీ, ఈ అభిషేకానికి ఆవుపాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచాదార, కొబ్బరికాయ, పూలదండలు తీసుకొని భక్తులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కొణిజర్ల: తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం కల్పిస్తూ.. అభివృద్ధి సాధించాలంటే ఒక్క బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. కొణిజర్ల మండలం ఉప్పలచలకలోని సుమారు 40 కుటుంబాలు శనివారం ఎమ్మెల్యే రాములునాయక్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాములునాయక్ వారందరికీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపట్టిన ప్రజా సంక్షేమ అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏలూరి శ్రీనివాసరావు, చెరుకుమల్లి రవి, డేరంగుల బ్రహ్మం, శ్రీను, చల్లా మోహన్‌రావు, చిన పుల్లయ్య, బండారు కృష్ణ, తంబి, రవీందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు..

బోనకల్: మండల కేంద్రంలోని కాంగ్రెస్‌కు చెందిన 100 కుటుంబాలు శనివారం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుల సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్ అభివృద్ధిని చూసి పార్టీలో చేరడం శుభపరిణామన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మధిరలో గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, నాయకులు కొండ, మల్లికార్జున్, నాగేశ్వరరావు, సుధాకర్ రావు, వెంకటేశ్వరరావు, బ్రహ్మయ్య, నరసింహారావు, రమేష్ ఉన్నారు.



కొణిజర్ల: బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

జెడ్పీ చైర్మన్ విస్తృత పర్యటన



సీసీరోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, తదితరులు

ముదిగొండ: మండలంలో న్యూలక్ష్మీపురం, వనంవారికిష్టాపురం, మల్లన్నపాలెం, పమ్మి, వల్లబి, గంధసిరి గ్రామాల్లో జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ శనివారం విస్తృతంగా పర్యటించారు. వనంవారికిష్టాపురం, మల్లన్నపాలెం గ్రామాల్లో మంజూరైన ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం బాధిత కుంటుంబాలను పరామర్శించి, రైతు భీమా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మారెడ్డి, వెంకట్‌గౌడ్, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపులేటి దుర్గ, ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి, రైతు సమన్వయ సమితి కన్వీనర్ పోట్ల ప్రసాద్, డైరెక్టర్లు బత్తుల వీరారెడ్డి, శ్రీను, జిల్లా నాయకులు ఎర్ర వెంకన్న, మీగడ శ్రీనివాస్‌యాదవ్, సర్పంచ్‌లు, తుపాకుల రమాదేవి, చిలకల విజేత, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

బీటీ నిర్మాణానికి శంకుస్థాపన..

కల్లూరు రూరల్: మండలంలోని ఎర్రబోయిన పల్లి ఊర చెరువు కట్టను విస్తరించి, 2కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శనివారం సాయంత్రం సర్పంచ్ సింగిసాల పద్మ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అజయ్‌కుమార్, రామారావు, ప్రసాద్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణంపై తర్జన భర్జన

వైరా: వైరా రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణంపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. కొన్నేళ్లుగా 100 అడుగుల పైనే ఉన్న రిజర్వాయర్ రహదారి.. ఆక్రమణకు గురైంది. ప్రస్తుతం ఆ ఆక్రమణలే అడ్డుగా మారాయి. రహదారి నిర్మాణంపై శనివారం తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ పి.వెంకటేశ్వర్లు రిజర్వాయర్ కుడి కాల్వ నుంచి కొలతలు వేశారు. రెండు వైపులా కలిపి రోడ్డు వెడల్పు 60 అడుగులు ఉండేలా కొలతలు వేస్తూ.. క్రాస్ రోడ్డులో ఉన్న కొన్ని దుకాణాల వద్దకు రాగానే కొలతలు నిలిపివేశారు. దీంతో అఖిలపక్ష నాయకులు తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్‌ను కలిసి భవిష్యత్ అవసరాల నిమిత్తం 60 అడుగులు తగ్గకుండా రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, సీపీఎం నాయకుడు బొంతు రాంబాబు, కాంగ్రెస్ నాయకులు రంగారావు, సీతారాములు, నాగరాజు, సీపీఐ నాయకులు బాబు, గోపాలరావు, బీజేపీ నాయకుడు భద్రయ్య, తదితరులు ఉన్నారు.



రోడ్డు వెడల్పుకు మార్కింగ్ చేస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

తేజస్సు మినిస్ట్రీస్ నూతన చర్చి ప్రారంభం

పెనుబల్లి: మండలంలోని బయ్యన్నగూడెంలో నూతనంగా నిర్మించిన తేజస్సు మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ రెవ॥ బెజవాడ సుధీర్‌బాబు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకుడు కొండూరి సుధాకర్ ఈ కార్యక్రమంలో పాల్గొని పాస్టర్ సుధీర్‌బాబుకు, సంఘస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చర్చి పాస్టర్.. చర్చి ఆవశ్యకతను వివరించారు. అనంతరం భారీ అన్నధాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరెడ్డి, కోటేశ్వరరావు, భాగ్యలత, తరణ్‌కుమార్, తేజస్వరూప్, నరసింహాస్వామి, పాస్టర్లు విజయ్, రాజా, సంఘస్తులు పాల్గొన్నారు.

మౌళిక సదుపాయాల రూపకల్పనకు ప్రాధాన్యత

కల్లూరు రూరల్: మండలంలో మౌళిక సదుపాయాల రూపకల్పనకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రాధాన్యత ఇస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. శనివారం ఎర్రబోయినపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, ఎంపీపీ బీరవెల్లి రఘు, జెడ్పీటీసీ సభ్యులు కట్టా అజయ్‌కుమార్ మాట్లాడారు. కల్లూరు మండలంలోని గ్రామాల్లో 95శాతం సీసీరోడ్ల నిర్మాణం పూర్తి అయ్యిందన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ ప్రసాద్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు కేంద్రం బాధ్యత వహించాలి

కారేపల్లి: మణిపూర్‌లో గిరిజనులపై జరిగిన ఘటనకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. శనివారం మండలంలోని ఉసిరికాయలపల్లిలో సర్పంచ్ బానోత్ బన్సిలాల్ అధ్యక్షతన గిరిజన సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వీరభద్రం మాట్లాడుతూ.. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం కనుసన్నల్లోనే మారణకాండ మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. మణిపూర్ సీఎంను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 19 నుంచి మూడురోజుల పాటు జరిగే ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ మూడో బహిరంగ మహాసభను గిరిజనులు జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు భూక్యా కృష్ణనాయక్, తేజావత్ చందర్‌నాయక్, భూక్యా మోహన్, బానోత్ సరోజ, భూక్యా వీరునాయక్, బాసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం నాయక్